

ఆలయ అభివృద్ధికి విరాళం

తాడేపల్లిరూరల్: కంతంరాజు కొండూరులోని మహంకాళీ అమ్మవారి దేవస్థానం అభివృద్ధికి విజయవాడకు చెందిన నీలిమ రూ.1,01,116 ఆదివారం అందజేశారు.



పులిచింతలలో నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు 2.39 లక్షల క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం 43.54 టీఎంసీలు నిల్వ ఉంది. పూర్తి సామర్థ్యం 45.77 టీఎంసీలు.

పానకం బిందె రూ.1.50



మంగళగిరి:పట్టణంలోని పానకాల లక్ష్మీనృసింహ స్వామి పానకం ధరను రూ.1.50కు తగ్గించినట్లు ఆలయ ఈఓ ఏ. రామకోటిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్షయపాత్ర ఫౌండేషన్ సహకారంతో ధర తగ్గించామని, భక్తులు వినియోగించుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

క్రీడలతో స్నేహ సంబంధాలు బలోపేతం

- డీజీ త్రివిక్రమ వర్మ
- ఉత్సాహంగా ఏపీఎస్పీఎఫ్ ఆవిర్భావ వేడుకలు ప్రారంభం



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆవిర్భావం సందర్భంగా ఆదివారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఘనంగా క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన సంస్థ డీజీ డాక్టర్ త్రివిక్రమ వర్మ మాట్లాడుతూ.. సిబ్బందిలో శారీరక, మానసిక దృఢత్వం, క్రీడా స్ఫూర్తిని పెంచేదుకు ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తామన్నారు. ఐజీ బి.వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ క్రీడలతో సిబ్బంది మధ్య స్నేహపూర్వక సంబంధాలను మెరుగుపడతాయన్నారు. ఈ వేడుకలు ఈనెల 23 వరకు జరుగుతాయని, మొదటి మూడు రోజులు 202 మంది సిబ్బందికి క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, పరుగు పందేలు ఉంటాయని, చివరి రోజు విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో విజయవాడ జోన్ కమాండెంట్ ఎం.శంకరరావు, అసిస్టెంట్ కమాండెంట్లు కె.కృష్ణమూర్తి, బి.శ్రీనివాసరావు, పి.వి.ఎస్.ఎన్.మల్లికార్జునరావు, టి.కృష్ణమాచారి, కె.శ్రీనివాసులు, టి.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


23న ముగింపు సభకు హోం మంత్రి హాజరు

ఏఎన్‌యూ: ఏపీ ఎస్పీఎఫ్(ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్) స్టేట్ లెవల్ స్పోర్ట్స్ మీట్ ముగింపు సభ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 23వ తేదీన జరగనుంది. హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఏపీ హోమ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజీత్, ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె గంగాధరరావు గౌరవ అతిథులుగా పాల్గొంటారు.

నవంబర్ 20న జెడ్పీ సర్వసభ్య సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నవంబర్ 20న జరగనుంది. ఈమేరకు జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు షెడ్యూల్ విడుదల చేశారు. జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనున్న సర్వసభ్య సమావేశంలో మూడు జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కానున్నారు.


సాగునీటి సమాచారం



తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 1516 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువ, పశ్చిమ కాలువ, నిజాంపట్నం కాలువకు నీటిని ఆపేశారు. బ్యాంక్ కెనాల్‌కు 513 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 82 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 1217 క్యూసెక్కులు విడుదల చేశారు.

కృష్ణా నదికి వరద నీరు

కొల్లూరు : ఎగువన కురుస్తున్న వర్షాల ప్రభావంతో కృష్ణా నదిలో వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. గత నాలుగు రోజులుగా నదిలోకి కొద్ది మొత్తంలో నీటిని వదులుతున్న అధికారులు ప్రవాహం అధికమవడంతో ఆదివారం విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి దిగువకు 1.18 లక్షల క్యూసెక్కులు విడుదల చేశారు. దీంతో మండలంలోని కృష్ణా నదిలోకి ఆ నీరు చేరి నిండుగా మారింది. నీటి విడుదల పరిమాణం పెరిగిన పక్షంలో పెసర్లంక అరవింద వారధి ఎగువన నక్కపాయ గండి ద్వారా వరద నీరు కొల్లూరు కరకట్ట దిగువన ఉన్న పల్లపు ప్రాంతాలలోకి ప్రవేశించే ముప్పు ఉంది.



హోర్డింగ్ అక్రమాలకు బోర్డింగ్

నగరంలో పేరుకుపోతున్న యాడ్స్ బకాయిలు

- 25 ప్రాంతాల్లో గ్యాంట్రీ హోర్డింగ్స్
- ప్రతి నెలా రూ.లక్ష నుంచి లక్షన్నర దాకా వసూలు చేసుకుంటున్న కాంట్రాక్టర్
- నగరపాలక సంస్థకు పైసా కూడా కట్టడం లేదు
- బకాయిల వసూళ్లల్లో మీనమేషాలు లెక్కిస్తున్న పట్టణ ప్రణాళిక అధికారులు
- రూ. 4.50కోట్లు బకాయిలు ఉంటే రూ. 1.10కోటి మాత్రమే ఉన్నట్లు అంచనా
- గ్యాంట్రీ హోర్డింగ్స్ నిర్వహించాలంటే నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఒప్పందం
- నగరంలో ఎక్కడా కనిపించని ట్రాఫిక్ సిగ్నల్స్, సీసీ కెమెరాలు



లక్ష్మీపురంలో గ్యాంట్రీ హోర్డింగ్స్‌పై ప్రకటనలు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో గ్యాంట్రీ (క్రేన్) హోర్డింగ్స్ మాయాజాలం నడుస్తోంది. దీనిపై కౌన్సిల్ వేదికగా కార్పొరేటర్లు పలుమార్లు అధికారుల్ని నిలదీసినా ఫలితం లేదు. మాయాజాలాన్ని పసిగట్టిన గత కమిషనర్ కీర్తి చేకూరి నిబంధనల మేరకు హోర్డింగ్స్ నిర్వహణ చేయాలని పట్టుబట్టారు. ఒప్పందంలో కుదుర్చుకున్న అంశాల్ని అమలు చేసే విధంగా గ్యాంట్రీ హోర్డింగ్ నిర్వాహకుడిపై కొరడా ఝళిపించేందుకు రంగం సిద్ధం చేశారు. ఆ తరువాత కమిషనర్ బదిలీ కావడంతో 'యథా రాజా తథా ప్రజా' అన్నట్లుగా పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు వ్యవహరిస్తున్నారు.

బకాయిలపై దాగుడుమూతలు

గుంటూరు నగరంలో 25 ప్రాంతాల్లో గ్యాంట్రీ హోర్డింగ్స్‌ను కాంట్రాక్టర్ ఏర్పాటు చేశారు. ఒక్కో హోర్డింగ్స్‌పై యాడ్స్ వేసినందుకు వ్యాపారస్తుల నుంచి రూ.లక్ష నుంచి 1.50లక్ష దాకా వసూలు చేస్తున్నారు. కాని కార్పొరేషన్ కట్టేది మాత్రం రూ.సంవత్సరానికి 75లక్షలు మాత్రమే. ఈ మొత్తాన్నీ కూడా సక్రమంగా కడతున్నారంటే అది లేదు ! నగరంలో హోర్డింగ్స్ సుమారు ఆరు సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్నారు. ఈ లెక్కన రూ.4.50కోట్లు కార్పొరేషన్‌కు జమ కావాలి. అయితే, రూ. 1.10కోటి మాత్రమే బకాయి ఉందని పట్టణ ప్రణాళిక అధికారులు చెప్పడం విశేషం. కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోతే వసూలు చేయకుండా ఇంత వరకు ఏం చేస్తున్నారని గత కమిషనర్ కీర్తి చేకూరి పట్టణ ప్రణాళిక అధికారులపై వివరణ అడిగినట్లు సమాచారం. ప్రస్తుత కమిషనర్ వసూలుపై దృష్టి సారిస్తారో లేదో వేచి చూడాలి.

ఒప్పందానికి మంగళం

నగరంలో గ్యాంట్రీ హోర్డింగ్స్ నిర్వహించాలంటే ట్రాఫిక్ సిగ్నల్స్‌తో పాటు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఒప్పందం ఉంది. కానీ ఎక్కడా కూడా సదరు కాంట్రాక్టర్ ఏర్పాటు చేసిన పాపాన పోలేదు. అధికారులు కూడా దీనిపై చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో పాటు హోర్డింగ్స్ అడుగుల్లో ఏర్పాటు చేస్తామని చెప్పి మీటర్లలో ఏర్పాటు చేసుకున్నారు. సరే.. వీటి నిర్వహణ ఏమైనా పట్టించుకుంటారా అంటే అదీ లేదు ! వర్షాలకు, ఈదురు గాలులకు గ్యాంట్రీ హోర్డింగ్స్ పడితే ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందో అని గతంలో డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు కౌన్సిల్ వేదికగా ప్రశ్నించారు.



సిగ్నల్స్ పనిచేయకపోవడంతో ట్రాఫిక్ కంట్రోల్ చేస్తున్న పోలీస్

పట్టణ ప్రణాళిక అధికారుల సహకారం

హోర్డింగ్స్ బకాయిలకు సంబంధించి చెక్కులు ఇస్తే వాటిని తిరిగి సదరు కాంట్రాక్టర్‌కు ఇచ్చేయడం టౌన్ ప్లానింగ్ అధికారులకు పరిపాటే. గతంలో కూడా చాలా చెక్కులు కార్పొరేషన్‌కు అందాయి. వీటిలో ఎన్ని నగరపాలక సంస్థకు జమ అయ్యాయో నిశితంగా పరిశీలిస్తే తేటతెల్లమవుతుంది. దీని వెనుక పట్టణ ప్రణాళిక అధికారులు పూర్తి సహకారాలు ఉన్నాయని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. ఒక వేళ చెక్కుల గురించి ఎవరైనా గట్టిగా అడిగితే సదరు కాంట్రాక్టర్ నుంచి తెప్పించుకుని నగరపాలక సంస్థకు జమ చేస్తుంటారు.ఎవరూ పట్టించుకోకపోతే తిరిగి ఇస్తుంటారని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి.

పట్టణ ప్రణాళిక అధికారులే ఇన్వెస్టర్లు

హోర్డింగ్స్ నిర్వహణ వల్ల ప్రతి నెలా లక్షల్లో ఆదాయం సమకూరుతున్న విషయం తెలుసుకున్న కొంత మంది పట్టణ ప్రణాళిక అధికారులే కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై పెట్టుబడి పెట్టడం పరిపాటిగా మారింది. అధికారులే ఇన్వెస్ట్ చేయడంతో ఎవరూ కూడా ఈ కుంభకోణం గురించి పట్టించుకోరు అనే విషయం నగరపాలక సంస్థ కార్యాలయంలో బహిరంగంగానే చర్చించుకోవడం గమనార్హం. ఇందులో కొసమెరుపు ఏమిటంటే 25 గ్యాంట్రీ హోర్డింగ్స్‌కు విద్యుత్ సరఫరాకు సంబంధించిన బిల్లులు కూడా నగరపాలక సంస్థ నుంచే చెల్లింపులు జరుగుతున్నాయంటే అతిశయోక్తి లేదు. గత కమిషనర్ కీర్తి చేకూరి కనెక్షన్లు తొలగించాలని ఆదేశించినప్పటికీ ఎటువంటి ఫలితం లేకుండా పోయింది.



హిందూ కాలేజీ జంక్షన్‌లో పనిచేయని సిగ్నల్

రూ.50 లక్షలు చెక్కు అందజేశారు

గ్యాంట్రీ హోర్డింగ్స్ నిర్వహణకు సంబంధించి నిర్వాహకుల నుంచి రూ.1.10 కోటి బకాయి ఉంది. కొద్ది రోజుల కిందట కాంట్రాక్టర్ రూ.50లక్షల చెక్కును అందజేశారు. ఇంకా రూ.60లక్షల బకాయి ఉంది. వీలైనంత త్వరగా వసూలు చేస్తాం.

– లక్ష్మణస్వామి, టీపీఎస్

'ఎయిడెడ్' అమ్మకాలకు బ్రేక్

- గుంటూరులోని రాఘవేంద్ర ఎయిడెడ్ స్కూల్లో ఉపాధ్యాయ నియామక ప్రక్రియ నిలిపివేత
- ఈనెల 18న హైకోర్టు తీర్పు
- లేని విద్యార్థులను ఉన్నట్లుగా చూపి పోస్టులు భర్తీ చేసుకునేందుకు ప్రయత్నించిన యాజమాన్యం
- బోగస్ హాజరు, స్కూల్లో అవకతవకలపై స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు
- విచారణ జరిపి, హైకోర్టుకు నివేదిక అందజేసిన విద్యాశాఖ



రాఘవేంద్ర ఎయిడెడ్ యూపీ పాఠశాల (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల్ని అంగట్లో సరుకులుగా అమ్ముకునేందుకు వేసిన ఎత్తుగడకు హైకోర్టు బ్రేక్ వేసింది. విద్యార్థులు లేకుండా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పింది. గుంటూరు ఆర్టీసీ కాలనీలోని శ్రీ రాఘవేంద్ర ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల్ని నియమించడం లేదంటూ విద్యాశాఖపై వేసిన కంటెమ్ట్ ఆఫ్ కోర్టు ఉత్తర్వులను సైతం కొట్టివేస్తూ హైకోర్టు ఈనెల 18న తీర్పు వెలువరించింది.

వివరాల్లోకి వెళితే...

రాఘవేంద్ర ఎయిడెడ్ యూపీ స్కూల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం పాఠశాల కరస్పాండెంట్ 2023 అక్టోబర్ 10న హైకోర్టులో విద్యాశాఖకు వ్యతిరేకంగా కంటెమ్ట్ కేసు దాఖలు చేశారు. పాఠశాలలో విద్యార్థులున్నా టీచర్ పోస్టులను భర్తీ చేయకపోవడంతో బోధన జరగక నష్టం వాటిల్లుతోందని హైకోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో స్పందించిన హైకోర్టు నాలుగు పోస్టులు మంజూరు చేసింది. ఆయా పోస్టుల భర్తీకి పాఠశాల యాజమాన్యం దిన పత్రికల్లో ప్రకటనలు ఇచ్చింది. కాగా పాఠశాలలో విద్యార్థులు లేకుండా బోగస్ హాజరు వేయడంతో పాటు, మధ్యాహ్న భోజన పథకంలో అవకతవకలు, సరైన వసతులు లేవంటూ వివిధ కారణాలతో స్థానికులు గత మార్చిలో కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని ఆదేశించడంతో పాటు డీఈవో పి.శైలజ ఉప విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావును విచారణాధికారిగా నియమించారు. ఏప్రిల్ 21న డీవైఈవో ఇచ్చిన నివేదికలో అవన్నీ వాస్తవాలేనని తేలింది.

వాస్తవాలు వెలుగు చూడకుండా మేనేజ్

ఇదే సమయంలో రాష్ట్ర విద్యాశాఖ నిజ నిర్ధారణకు నియమించిన త్రిసభ్య కమిటీని సైతం సదరు పాఠశాల కరస్పాండెంట్ వాస్తవాలు వెలుగు చూడకుండా మేనేజ్ చేశారు. దీంతో మూడు పోస్టుల భర్తీకి త్రిసభ్య కమిటీ అనుమతి ఇచ్చింది. దీనిని సవాలు చేస్తూ పాఠశాలలో విద్యార్థులు లేకుండా, బోగస్ హాజరు నమోదు చేసి లేని విద్యార్థులను ఉన్నట్లుగా చూపిస్తున్నారని తల్లిదండ్రుల నుంచి ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డితో పాటు జిల్లా కలెక్టర్‌కు మరలా ఫిర్యాదులు వెళ్లాయి. టీచర్ పోస్టులను అమ్ముకునేందుకు ఇదంతా సృష్టించారని ఆధారాలతో నివేదిక అందజేశారు. లేని విద్యార్థులను ఉన్నట్లుగా చూపి, పోస్టులను మంజూరు చేయించుకోవడంతో పాటు, వాటిని భర్తీ చేయకుండా అడ్డు తగులుతున్నారంటూ ప్రభుత్వంపైనా, విద్యాశాఖాధికారులపైనా కంటెమ్ట్ ఆఫ్ కోర్టు కేసు దాఖలు చేశారని ఈనెల 18న హైకోర్టు విచారణలో గుర్తించింది. దీంతో కంటెమ్ట్ ఆఫ్ కోర్టు పిటిషన్‌తో పాటు టీచర్ పోస్టుల భర్తీని సైతం రద్దు చేసింది.

టీచర్ పోస్టుల పేరిట మోసపోతున్న అభ్యర్థులు

ఉపాధ్యాయ పోస్టుల కోసం ఏళ్ల తరబడి వేచి చూస్తున్న నిరుద్యోగ అభ్యర్థులు పలు ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాల చేతిలో మోసపోతున్నారు. గతంలోనూ ఇదే విధంగా గుంటూరు నగరంలోని పలు ఎయిడెడ్ పాఠశాలలు కోర్టు నుంచి అనుమతి తెచ్చుకుని ఒక్కో పోస్టును రూ.30 లక్షలకు విక్రయించిన సంఘటనలున్నాయి. అభ్యర్థుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటూ పోస్టుల భర్తీ పేరుతో నిబంధనలు తుంగలో తొక్కి, పోస్టులను లక్షలకు అమ్ముకుంటున్న యాజమాన్యాలకు అధికారులు సైతం సహకరిస్తున్నారు. తాజాగా ఎయిడెడ్ టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించిన కార్యకలాపాలను ప్రభుత్వం పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోకి మార్చివేసింది. యాజమాన్యాల ప్రమేయం లేకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల అర్హతలు ఆధారంగా ప్రభుత్వమే పాఠశాలల్లో నియమించనుంది.



పొలంలో సేద్యం చేస్తున్న రైతు (ఫైల్)

పంట మారితే.. సిరులు పండినట్టే !

- భూసారం పెరిగి అధిక దిగుబడులు
- రసాయన ఎరువుల ఖర్చు తగ్గే అవకాశం
- తెగుళ్లు, చీడపీడల నుంచి పంటలకు రక్షణ
- రైతులకు వ్యవసాయ శాఖ సూచనలు

కొరిటిపాడు(గుంటూరు): ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో గ్రామాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. రైతులు పొలాలు దున్ని పంటలు సాగు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఏటా ఒకే రకమైన పంటలు సాగు చేయడం వలన భూములు నిస్సారంగా మారి ఆశించినంతగా ఫలితాలు ఉండటం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో పంట మార్పిడి పద్ధతులు అవలంబిస్తే మంచి దిగుబడులు పెరగడమే కాకుండా భూమి కూడా సారవంతం అవుతుందని సాగు రంగం నిపుణులు చెబుతున్నారు. ఏటా ఒకే రకమైన పంటలు సాగు చేయడం ద్వారా పంట దిగుబడులు తగ్గడమే కాకుండా భూమి నిస్సారవంతంగా మారి తెగుళ్లు, చీడపీడల సమస్య కూడా ఎక్కువగానే ఉంటుందని అంటున్నారు. ముఖ్యంగా పంట మార్పిడిలో భాగంగా నేలంతా కప్పేలా ఉండే పంటలను ఎంపిక చేసుకోవాలని సూచిస్తున్నారు. ఇలా చేయడం వలన పంటలో కలుపు మొక్కలు ఎక్కువగా రాకుండా ఉంటాయి. నేల భౌతిక స్థితిలో కూడా మార్పు వస్తుంది. భూమిలో నీటి నిల్వ శక్తి వృద్ధి చెంది చీడపీడలు దూరమవుతాయి. ఫలితంగా పంటల రక్షణకు ఉపయోగించే రసాయన ఎరువుల ఖర్చు కూడా తగ్గుతుంది.



భూమికి సేంద్రియ ఎరువుగా మారే పెసర పంట


భూమికి మేలు చేసే అపరాలు..

పంటల మార్పిడిలో భాగంగా అపరాలు సాగు చేయడం వలన వాటి వేర్లు భూమి నుంచి పోషకాలను సులభంగా తీసుకుంటాయి. అపరాల పంటలు కొంత మేర నీటి ఎద్దడిని కూడా తట్టుకుంటాయి. ప్రధానంగా వీటి ఆకులు రాలడం వలన భూమికి సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది. ఈ పంటల వేరు మొదళ్లు నత్రజనిని స్థిరీకరిస్తాయి.

తెగుళ్లు, చీడపీడల నివారణ కోసం..

ఏటా ఒకే రకమైన పంటలు సాగు చేయడం వల్ల కొన్ని రకాల పురుగులు, తెగుళ్ల పంటను ఆశించి వృద్ధి చెందుతాయి. దీని వల్ల పంట దిగుబడి కూడా చాలా వరకు తగ్గిపోతుంది. పంట మార్పిడి చేసుకోవాలి. ఉదాహరణకు వరుసగా వరి పంట సాగు చేయకుండా పప్పు దినుసులు, నువ్వులు వంటి పంటలు సాగు చేసుకుంటే మేలు జరుగుతుంది. మినుములు, వేరుశనగ, పప్పుశనగ వంటి పంటలకు లద్దె పురుగులు ఎక్కువగా ఆశించి నష్టపరుస్తాయి. వీటి ఉధృతిని అరికట్టేందుకు జొన్న, వరి, మొక్కజొన్న, రాగులు వంటి ఆరుతడి పంటలతో మార్పు చేయాలి. పత్తి వేసిన పొలంలో మిరప పంట, పొగాకు వేసిన పొలంలో పప్పుశనగ వంటి పంటలు సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుంది. వరి వేసే పొలానికి ముందుగా జనుము, పిల్లిపెసర, జీలుగ వేస్తే సేంద్రియ ఎరువుగా తయారై పంటకు మంచి దిగుబడి ఉంటుంది. ఏటా పొగాకు సాగు చేసే భూమిలో అపరాల పంటలు సాగు చేసి ఆ తర్వాత ఏడాది పొగాకు వేస్తే మళ్లీ తెగుళ్ల రాకుండా నాణ్యమైన పొగాకు సాగు అవుతుంది.

అధిక దిగుబడి..



పంటల మార్పిడితో దిగుబడి పెరుగుతుంది. వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఉలవలు, రాగులు, మినుము, పెసర వంటి పంటలు సాగు చేస్తే భూమి సారవంతంగా మారుతుంది. అలాగే భూమిలో జనుము, పిల్లిపెసర, జీలుగ వంటి పంటలు వేసి బాగా కలియ దున్నితే సేంద్రియ ఎరువు తయారవుతుంది. దీని వలన రసాయన ఎరువుల ఖర్చు తగ్గుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో మినుములు, పెసర, పప్పుశనగ, రాగులు, సజ్జలు వంటి అపరాల పంటలకు మంచి గిరాకీ ఉన్నందున ఈ పంటలు సాగు చేసుకోవచ్చు.

– తోటకూర శ్రీనివాసరావు, గుంటూరు ఏడీఏ

సహానా కుటుంబానికి అండగా ఉంటాం

జీజీహెచ్‌లో మాజీ మంత్రి మేరుగ, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని పరామర్శ



బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న మేరుగ, అన్నాబత్తుని

పట్నంబజారు: తెనాలిలో టీడీపీ కార్యకర్త నవీన్ చేతిలో దాడికి గురై గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న మదిరి సహానాను మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున , మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తుని శివ కుమార్ పరామర్శించారు. సహన కుటుంబసభ్యులతో మాట్లాడి సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని భరోసానిచ్చారు. యువతి ఆరోగ్య పరిస్థితి గురించి వార్డు డాక్టర్లతో మాట్లాడారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్‌తో ఫోన్ ద్వారా మాట్లాడారు. మెరుగైన చికిత్స అందించాలని కోరారు. మాజీ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ తెనాలిలో సహానాపై దాడిని తీవ్రంగా ఖండించారు. ఆమెపై అత్యాచారం చేసి, తీవ్రంగా గాయపరిచి, హింసించి దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళలు, విద్యార్థినులు, చిన్నారులపై దాడులు పెరిగిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. హోం మంత్రి వంగల అనిత కళ్ళుండీ చూడలేని కబోదిలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ పాలనలో మహిళలపై ఏ ఒక్క దాడి జరగకుండా కంటికి రెప్పలా కాపాడిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని తెలిపారు. మహిళలపై దాడులు జరిగినా, ఏదైనా అఘాయిత్యానికి ఒడిగట్టినా.. దిశ పోలీసులు తక్షణమే స్పందించేవారని స్పష్టం చేశారు. అసలు ఈ ప్రభుత్వంలో దిశ యాప్ ఏమైందని ? ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ తెనాలి సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక.. మూడు మర్డర్లు.. ఆరు అత్యాచారాలు అనే చందంగా నడుస్తోందని ధ్వజమెత్తారు. కూటమి నేతల దౌర్జన్యాలకు అంతుపొంతు లేకుండా పోతోందని మండిపడ్డారు. '' వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 40 వేల మంది అమ్మాయిలు అదృశ్యం అయ్యారు అని అరిచావ్ కదా...? మీరు అధికారంలోకి వచ్చిన తరువాత వారిని తీసుకునివచ్చే ప్రయత్నం చేశారా పవన్ కళ్యాణ్ '' అంటూ ఆగ్రహంతో ప్రశ్నించారు. తెనాలిలో మంత్రి నాదెండ్ల మనోహర్ ఇలాకాలో ఇప్పటికే మూడు హత్యలు జరిగాయని, యువతిపై ఇంతటి దారుణం జరిగినా ఏం చేస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి నేతల అండదండలు లేకపోతే, దాడి చేసి ఆసుపత్రిలో చేర్చి నేరుగా తల్లితండ్రులకే ఫోన్ చేసి చెప్తారా ? అని ప్రశ్నించారు. అఘాయిత్యానికి పాల్పడిన నవీన్ మర్డర్ కేసులో నిందితుడిగా ఉన్నాడని, కొల్లిపరలో రౌడీషీట్ కూడా ఉందని తెలిపారు. సహానా అంశంలో స్పష్టమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఎంతటి పోరాటానికి వెనుకాడబోమని తేల్చిచెప్పారు.

క్లుప్తంగా

యూజీసీ నెట్‌లో ఉత్తీర్ణుడైన అమర్‌చంద్ర

అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అర్హత



తెనాలి: జాతీయస్థాయిలో యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) నిర్వహించిన 'నెట్' (నేషనల్ ఎలిజిబుల్ టెస్ట్)లో తెనాలికి చెందిన ఆళ్లమూడి అమర్ చంద్ర అర్హత సాధించారు. న్యూఢిల్లీ ప్రధాన కేంద్రంగా ఉన్న యూజీసీ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈ ఏడాది జూన్‌లో నెట్ పరీక్షను నిర్వహించింది. రెండు రోజుల కిందట ఫలితాలను ప్రకటించారు. ఈ పరీక్షలో అర్హత సాధించినవారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడిచే యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి అర్హులు. జాతీయస్థాయి యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ చేసేందుకు అర్హత లభిస్తుంది. ఈ పరీక్షల్లో 89.18 పర్సంటైల్‌తో ఉత్తీర్ణుడైన అమర్‌చంద్ర, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, పీహెచ్‌డీకి అర్హత సాధించారు. అమర్‌చంద్ర 2013లో ప్రైవేట్ స్కూలులో చదివి టెన్త్‌లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. నూజివీడులోని ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి బీటెక్ పూర్తిచేశారు. తర్వాత హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ సోషియాలజీ చేశారు. తెనాలికి చెందిన అంబేడ్కర్ చారిటబుల్ ట్రస్ట్ (యాక్ట్) వ్యవస్థాపకుడు ఆళ్లమూడి ప్రభాకరరావు కుమారుడు అమర్‌చంద్రను పలువురు అభినందించారు.

షూటింగ్ బాల్‌లో ఐలవరం విద్యార్థుల సత్తా



భట్టిప్రోలు: ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ 43వ ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్స్ అండ్ ఉమెన్స్ షూటింగ్ బాల్ స్టేట్ లెవెల్ చాంపియన్‌షిప్ పోటీలలో భట్టిప్రోలు మండలం ఐలవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రంలోని శ్రీ నేతాజీ ఇంగ్లిష్ మీడియం హైస్కూలులో జరుగుతున్న ఈ పోటీల్లో బాపట్ల జిల్లా నుంచి 28 మంది పాల్గొన్నారు. అందులో ఏడుగురు ఐలవరం హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికకావడం గమనార్హం. ఎంపికైన వారిలో పదో తరగతి విద్యార్థులు పి. అనిల్‌కుమార్, కె. రాజశేఖర్, బి. సీతామహాలక్ష్మి, ఎల్. రమ్య, హరిణి, ఎనిమిదో తరగతి విద్యార్థులు జి. సాయి సింధూజ, వి. రాధిక, ప్రియాంక ఉన్నారు. వీరంతా సోమవారం జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడనున్నారు. ఎంపికైన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ తుమ్మా శ్రీనివాసరెడ్డిని, హెచ్‌ఎం మాచర్ల మోహన్‌రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

బాపట్లటౌన్: కాలువలో దూకి యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని నాగరాజు కాలువ సమీపంలో చోటుచేసుకుంది. పట్టణంలోని ఉప్పరపాలేనికి చెందిన జంపని పూర్ణ పట్టణంలోని వీజీఆర్‌ఎం కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తనకు చదువురావడం లేదనే మనస్తాపంలో ఆదివారం కాలువలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గమనించిన మత్స్యకారులు వెంటనే విద్యార్థిని ఒడ్డుకు చేర్చారు. చికిత్స నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

23న నర్సుల సంఘం జిల్లా ఎన్నికలు



నామినేషన్లు వేసిన కోటమ్మ, పద్మజ ప్యానల్(ఫైల్)



నామినేషన్లు వేసిన శైలజ, అరుణ ప్యానల్ (ఫైల్)

- గుంటూరు జీజీహెచ్‌లో పోటాపోటీగా ఎన్నికల ప్రచారం
- అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా ఆస్పత్రిలో ఎన్నికల వేడి
- తామే గెలుస్తామంటూ రెండు ప్యానల్స్ ధీమా

గుంటూరు మెడికల్: ఆరేళ్ల తరువాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా ఎన్నికలు గుంటూరు జీజీహెచ్‌లో నిర్వహిస్తున్నారు. నూతన జిల్లా కమిటీలో పదవుల కోసం నర్సింగ్ సిబ్బంది రెండు ప్యానల్స్‌గా పోటీ చేస్తున్నారు. ఒక్కో ప్యానల్‌లో తొమ్మిది మంది చొప్పున ఈనెల 16న రెండు ప్యానల్స్ నామినేషన్లు వేశాయి. ఎన్నికలు ఈనెల 23న గుంటూరు జీజీహెచ్‌లో జరగనున్నాయి. పోటీలో నిలబడిన నర్సింగ్ సిబ్బంది కొద్ది రోజులుగా జీజీహెచ్‌లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఆస్పత్రులకు వెళ్లి తమకు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. ఎన్నికలతో జీజీహెచ్‌లో వాతావరణం బాగా వేడెక్కింది.

సంఘంలో 485 మంది సభ్యులు

జిల్లా నర్సుల సంఘంలో 485 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది గుంటూరు జీజీహెచ్‌వారే. ఇక్కడ 80 మంది హెడ్‌నర్సులు, 185 మంది స్టాఫ్‌నర్సులు ఉన్నారు. దీంతో కీలకమైన పదవుల్లో పోటీ చేస్తున్న వారంతా గుంటూరు జీజీహెచ్‌కు చెందిన వారే. 2019లో నర్సుల రాష్ట్ర సంఘంలో విభేదాలు వచ్చి నేటి వరకు ఎన్నికలు జరగలేదు. దీంతో పాత కార్యవర్గమే ఇప్పటి వరకు కొనసాగింది. ఎన్నికలు లేకుండా ఏకగ్రీవంగా చేయాలని కొంత మంది నర్సింగ్ సూపరింటెండెంట్ కార్యాలయం అధికారులు రెండు ప్యానల్స్ అభ్యర్థులను కూర్చోబెట్టి మాట్లాడినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. కీలక నేతలు ఇద్దరూ కూడా తమకు పదవులు కావాలని గట్టిగా నిలబడుతున్నారు. దీంతో ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఈ ఇద్దరూ కూడా ఒకసారి కీలకమైన పదవుల్లో ఉండి కూడా నర్సుల సంఘం బలోపేతం కోసం గాని, సభ్యుల ప్రయోజనాల కోసం ఏ మాత్రం పని చేయలేదనే విమర్శ వారిపై ఉంది. ముఖ్యంగా దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాల్లో నర్సింగ్ సిబ్బంది కేడర్‌ను ఆఫీసర్‌గా మార్చారు. ఏపీలో మాత్రం నేటికి కూడా స్టాఫ్‌నర్సు, హెడ్ నర్సుగానే కొనసాగుతున్నారు. ఎంతో కీలకమైన నర్సింగ్ ఆఫీసర్ కేడర్ తీసుకురావడంలో ప్రస్తుతం పోటీ చేస్తున్న రెండు ప్యానల్స్ ముఖ్యనేతలు గతంలో ఏమీ పట్టించుకోలేదనే విమర్శలు తీవ్రంగా ఉన్నాయి. తమ నిరసనలకు కూడా ఏమాత్రం మద్దతు ఇవ్వలేదని, అందువల్లే రెగ్యులర్ అవ్వకుండా కాలయాపన జరుగుతోందని కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బంది వాపోవుతున్నారు. సమస్యలు పరిష్కారం అవ్వాలంటే నూతనంగా పోటీలో ఉన్నవారిని నాయకులుగా ఎన్నుకోవాలని ఇతర సభ్యులు ఎన్నికల్లో ప్రచారం చేస్తున్నారు. ఎవరు గెలుస్తారో వారు తప్పనిసరిగా రెగ్యులర్ ఉద్యోగుల సమస్యలతోపాటుగా కాంట్రాక్ట్ సిబ్బంది సమస్యలపై పోరాటం చేయాలని పలువురు నర్సింగ్ సిబ్బంది కోరుతున్నారు.

ఆ ఇద్దరి కోసమే ఎన్నికలు

నర్సుల సంఘం జిల్లా కమిటీలో గెలుపు కోసం గుంటూరు జీజీహెచ్‌లోని ప్రభుత్వ నర్సింగ్ స్కూల్‌లో ట్యూటర్‌గా పనిచేస్తున్న వెల్లంపల్లి పద్మజ తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఈమె గతంలో సెక్రటరీగా పనిచేసి, మరలా అదే పదవికి పోటీ చేస్తున్నారు. సంఘంలో జిల్లా ప్రెసిడెంట్‌గా పనిచేసి, ప్రభుత్వ నర్సింగ్ కాలేజ్‌లో లెక్చరర్‌గా పనిచేస్తున్న బెల్లంకొండ శైలజ మరలా గెలవడానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. 2016 నుంచి 2019 వరకు ఒకే ప్యానల్‌లో ప్రెసిడెంట్, సెక్రటరీగా పనిచేసిన ఆ ఇద్దరి వ్యక్తుల వల్లే నేడు ఎన్నికలు నిర్వహిస్తున్నారని ఆస్పత్రిలో సిబ్బంది చర్చించుకుంటున్నారు.

చట్టపరమైన సహాయం అందించడమే లక్ష్యం

- హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి
- విజ్ఞాన్‌లో ఘనంగా ప్రో–బోనో క్లబ్ ప్రారంభం

చేబ్రోలు: ప్రో–బోనో క్లబ్ పథకం ద్వారా న్యాయ సేవలను అందించడంలో ఉన్న అంతరాలను తగ్గించి, ప్రజలకు చట్టపరమైన సహాయం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం, న్యాయవర్గాలు కలసి పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్‌లో న్యాయ బంధు పథకం కింద 'ప్రో–బోనో క్లబ్'ను విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆదివారం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి మాట్లాడుతూ ఈ క్లబ్ ప్రారంభం ద్వారా న్యాయ విద్యనభ్యసించే విద్యార్థులు సామాన్య ప్రజలకు, ముఖ్యంగా పేదలకు చట్టపరమైన సహాయం ఉచితంగా అందించడమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. న్యాయవాదులు తమ సామర్థ్యాన్ని, సేవలను స్వచ్ఛందంగా అందించడం ద్వారా సామాజిక న్యాయం అందరికీ సమానంగా చేర్చే ప్రయత్నం చేయాలన్నారు. సమాజంలోని బలహీన వర్గాలకు ఈ పథకం చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. న్యాయ సేవలు అందుబాటులోకి రావడం ద్వారా వారి హక్కులు, సమస్యలను పరిష్కరించుకోవడంలో ఇది ఒక గొప్ప అవకాశంగా నిలుస్తుందన్నారు. ప్రో–బోనో క్లబ్ అనేది స్వచ్ఛందంగా సేవలందించే న్యాయవాదులను సమీకరించే వేదికని, ఇక్కడ వారు సివిల్, క్రిమినల్ కేసుల్లో కూడా సహాయం అందిస్తారన్నారు. న్యాయ సేవలు అందరికీ అందడం చాలా అవసరమని, ఈ క్లబ్ ద్వారా న్యాయ సేవలు ప్రజల వరకు చేరతాయన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధిదారులు నేరుగా న్యాయవాదులను సంప్రదించడం లేదా ప్రభుత్వ న్యాయ వేదికల ద్వారా కూడా కనెక్ట్ అవ్వవచ్చునన్నారు. న్యాయవాదులు కూడా స్వచ్ఛందంగా తమ సమయాన్ని వెచ్చించి, సామాజిక న్యాయంలో భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ కొన్ని దేశాలలో ఇప్పటికే ఆర్టిఫీసియల్ ఇంటెలిజెన్స్ జడ్జిల సహాయంతో వేల కేసులు పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులందరూ న్యాయ విద్యతో పాటు ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి రంగాలలో కూడా పట్టు సాధించాలన్నారు. ఏపీ లీగల్ సర్వీసెస్ అథారిటీ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి మెంబర్ సెక్రటరీ ఎం.బబిత, గుంటూరులోని 4వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఆర్.శరత్‌బాబు, హెచ్.అమరలింగేశ్వరరావు, పి.లీలావతి, విజ్ఞాన్ వీసీ పి.నాగభూషణ్ పాల్గొన్నారు.



ప్రో-బ్రోనో క్లబ్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి, విజ్ఞాన్ చైర్మన్ లావు రత్తయ్య, వీసీ పి నాగభూషణ్ తదితరులు.

ఆర్థిక సాయం అందించడంలో ప్రభుత్వం విఫలం

అంబేడ్కర్ విగ్రహం వద్ద వరద బాధితుల నిరసన



లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

నెహ్రూనగర్: వరద బాధితులకు సాయం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని వీసీకే పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కె. జయసుధ విమర్శించారు. ఆదివారం లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వరద బాధితులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెల 31న కురిసిన భారీ వర్షానికి నగరంలోని బొంగరాలబీడు, శాంతినగర్, నల్లచెరువు, వసంతరాయపురం, కాకుమానువారితోట, వెంకటప్పయ్యకాలనీ, ఆనందపేట, శారదా కాలనీతో పాటు పలు లోతట్టు కాలనీలు నీట మునిగాయని తెలిపారు. ఇళ్లల్లోని వస్తువులన్నీ పూర్తిగా పాడైపోయాయని చెప్పారు. ప్రభుత్వం కూడా ఆర్థిక సాయం కొంత మందికి ఇచ్చి..మరి కొంత మందికి ఇవ్వకుండా వదిలేసిందని విమర్శించారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వచ్చి బాధితుల వివరాలు సేకరించకుండా రోడ్డు మీద ఒకరు, ఇద్దరి పేర్లు నమోదు చేసుకుని వెళ్లారని ఆమె ఆరోపించారు. వారికి మాత్రమే రూ.10వేలు చొప్పున జమ చేశారని, మిగిలిన వారి పేర్లు రాసుకోకపోవడంతో వారికి ఆర్థిక సాయం అందలేదని వివరించారు. మిగిలిన బాధితులకు కూడా సాయం అందించాలని ఆమె డిమాండ్ చేశారు. వివిధ సంఘాల నాయకులు పాగళ్ల ప్రకాష్, సీహెచ్ వాసు, రమణయ్య, డెన్నీస్ రాయ్, సాంబశివరావు, మాల్యాద్రి, లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఒత్తిడిని అధిగమించాలి

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



క్రీడా, సాంస్కృతిక పోటీల విజేతలతో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, వెంకటేశ్వర్లు, ప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం ద్వారా ఒత్తిడిని అధిగమించాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. యూటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక పోటీల విజేతలకు ఆదివారం బ్రాడీపేటలోని సంఘ జిల్లా కార్యాలయంలో బహుమతి ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షురాలు బి.ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై పని ఒత్తిడి పెరిగిందని, తద్వారా అనారోగ్యానికి, ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉపాధ్యాయులకు క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించిన ఘనత యూటీఎఫ్‌కే దక్కుతుందన్నారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ పసాద్ మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరిలో కాకినాడలో 20 వేల మంది ఉపాధ్యాయులతో నిర్వహించనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలకు గుంటూరు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని అన్నా రు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ క్రీడల నిర్వహణలో సహాయ, సహకారాలు అందించిన వ్యాయామ ఉపాధ్యాయులకు, క్రీడా మైదానాలను ఇచ్చిన యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి ఎండీ గయాసుద్దొలా, నాయకులు సీహెచ్ ఆదినారాయణ, యు.రాజశేఖర్‌రావు, జి.వెంకటేశ్వరరావు, ఎం.గోవిందయ్య, టి.ఆంజనేయులు, ఏ.శ్రీనివాసరావు, కె. కేదారనాథ్, ఎం.కోటిరెడ్డి, కె. ప్రేమ్‌కుమార్, కె.ప్రభాజీ పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థి మృతదేహం లభ్యం



తెనాలి రూరల్: తెనాలి మండలం సంగంజాగర్లమూడి వద్ద కాల్వలో గల్లంతైన బీటెక్ విద్యార్థి మృతదేహం లభించింది. గుంటూరు మండలం లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో బీటెక్ చదువుతున్న రవీంద్ర(20) ఐదుగురు స్నేహితులతో కలిసి శనివారం ఉదయం సంగంజాగర్లమూడి వచ్చి కొమ్మమూరు కాల్వలో దిగి గల్లంతైన సంగతి తెలిసిందే. రవీంద్ర మృతదేహాన్ని కాకుమాను మండలం కొల్లిమర్ల వద్ద ఆదివారం గుర్తించారు. రూరల్ ఎస్‌ఐ సీహెచ్ ప్రతాప్, సిబ్బంది అక్కడకు వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె . వీరయ్య



విజేతలకు బహుమతులు అందజేస్తున్న యూనివర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్

ఏఎన్‌యూ :క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యూనివర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె వీరయ్య అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ స్థాయి అంతర్ కళాశాలల పురుషుల బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగాయి. ముగింపు కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు క్రీడల ఆవశ్యకతను గుర్తించాలన్నారు. క్రీడారంగానికి యూనివర్సిటీ ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందన్నారు. కార్యక్రమానికి యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డీన్ ఆచార్య పీపీఎస్ పాల్‌కుమార్ అధ్యక్షత వహించారు. పోటీలలో బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల(మొదటి బహుమతి), ఆర్‌వీఆర్ అండ్ జేసీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్(రెండో బహుమతి), బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల (మూడో బహుమతి) సాధించాయి. విజేతలకు ప్రిన్సిల్ ఆచార్య కె వీరయ్య బహుమతులు అందజేశారు.

ప్రారంభమైన చదరంగ పోటీలు



గుంటూరు రూరల్: విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రావీణ్యం అవసరమని, చెస్ ద్వారా సృజనాత్మకతను మెరుగుదిద్దుకోవచ్చని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు అన్నారు. ఆదివారం లాంలోని కళాశాలలో ఆనంద్ చెస్ వింగ్స్, కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న తెలుగు స్టేట్స్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు 232 మంది పాల్గొన్నారన్నారు. టోర్నమెంట్‌లో క్రీడాకారులకు ఏడు రౌండ్లుగా నిర్వహించడం జరిగిందన్నారు. టోర్నమెంట్‌కు ఆర్బిటర్‌గా ఆనంద్ చెస్ వింగ్స్ డైరెక్టర్ మామిడాల గోపీనాథ్ వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్ర చదరంగం అసోసియేషన్ అధ్యక్షుడు వి.సత్యనారాయణ, కార్యదర్శి వై.సుమన్ మాట్లాడుతూ క్రీడా పోటీలలో గెలుపు ఓటములు సహజమని ప్రతి క్రీడాకారుడు తమ క్రీడలో నైపుణ్యతను మెరుగుపరుచుకునే దిశగా కృషి చేయాలన్నారు. గెలుపు సహజమైనా ఓటమి మరో గెలుపునకు నాంది అని గుర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో క్రీడాకారులు, అధ్యాపకులు, కోఆర్డినేటర్‌లు తదితరులున్నారు.

బంగారు పతకం సాధిస్తే రూ. లక్ష ఇస్తా!

క్రీడాకారులకు ఫ్యాంగ్‌టెక్ ల్యాబ్ అధినేత వెంకట్ ఆఫర్



జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జాతీయ క్రీడా పోటీల్లో బంగారు పతకం సాధించే క్రీడాకారులకు రూ.లక్ష బహుమతిగా అందిస్తానని ఫ్యాంగ్ టెక్ ల్యాబ్ అధినేత జొన్నలగడ్డ వెంకట్ ఆఫర్ ఇచ్చారు. ఒరిస్సాలోని భువనేశ్వర్‌లో ఈ నెల 25 నుంచి 29 వరకు జరగనున్న జాతీయ జూనియర్ అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆదివారం స్థానిక లక్ష్మీపురంలోని ఫ్యాంగ్ టెక్ ల్యాబ్ సత్కరించారు. వెంకట్ మాట్లాడుతూ క్రీడాకారుల్లో ఎక్కువ శాతం పేదవారు ఉంటారని, వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని పేర్కొన్నారు. తమ సంస్థ అటువంటి వారికి అండగా ఉంటుందని తెలిపారు. ఎన్ఆర్ఐ కొల్లా అశోక్ మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులకు సహాయం అందిస్తామని చెప్పారు. క్రీడా సంఘాలు విరివిగా పోటీలు నిర్వహిస్తే ప్రతిభగలవారు వెలుగులోకి వస్తారని పేర్కొన్నారు. అనంతరం జాతీయ పోటీలకు ఎంపికైన ఎస్.రోషన్, ఎస్.హమీద్, ఎండి.ఆసియా, కిశోర్, వై.సతీష్‌లను సత్కరించారు. కార్యక్రమంలో అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, కోచ్ రవి, సీహెచ్‌వీ రాజు, కె.అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

రెప్పపాటులో ఘోర రోడ్డు ప్రమాదం

- మూడు వాహనాలు ఢీ.. • ఒకరి మృతి • మరో 11 మందికి గాయాలు



ప్రమాద ఘటనా స్థలం

బొల్లాపల్లి: రెప్పపాటులో చోటుచేసుకున్న ప్రమాదంలో మూడు వాహనాలు ఢీకొనగా ఒకరు మృతి చెందగా ఐదుగురు గాయపడిన ఘటన బొల్లాపల్లి మండల పరిధిలోని మట్టి కట్ట వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కారెంపూడికి చెందిన నలుగురు యువకులు కారులో బొల్లాపల్లి మండలం మేళ్లవాగు వైపు నుంచి కారెంపూడి వస్తున్నారు. ప్యాసింజర్ ఆటో కారెంపూడి నుంచి మేళ్లవాగు వస్తుండగా కారు– ఆటో ఢీకొన్నాయి. ఈ ఘటనతో వెనుక వేగంగా వస్తున్న గూడ్స్ వాహనం క్షణాల్లో అదుపుతప్పి వీటిని ఢీకొనడంతో ప్రమాద ఘటన బీభత్సంగా మారింది. ప్రమాదంలో కారెంపూడి శివారు ఆదినారాయణ కాలనీకి చెందిన కారు డ్రైవర్ పేరుబోయిన శివ(23) ఉరఫ్ డీజే స్పాట్‌లోనే మృతి చెందారు. కారులో ఉన్న నాగేంద్రబాబు తీవ్రంగా గాయపడగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. బొల్లాపల్లి మండలం మేళ్లవాగుకు చెందిన ఆటో డ్రైవర్ పులగం వెంకట్రామయ్యతో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న దారం పద్మ, కాటనబోయిన నారాయణ మరో ముగ్గురు గాయపడ్డారు. ఫ్లిప్ కార్ట్ గూడ్స్ వాహనం డ్రైవర్‌తో పాటు ఉన్న మరొకరికి కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులలో తీవ్ర గాయాలైన వారిని 108లో నరసరావుపేట, గుంటూరు హాస్పిటల్స్‌కు తరలించారు. బొల్లాపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి క్షతగాత్రుల వివరాలు సేకరిస్తున్నారు. బండ్లమోటు ఎస్‌ఐ ఏ బాలకృష్ణ కేసు నమోదు చేశారు. ఇదిలా ఉంటే పెళ్లయిన ఏడాదికే శివను మృత్యువు కబలించింది. భార్య కుమారుడున్నారు. ఈ ఘటనతో ఆదినారాయణ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.



ఘటనా స్థలిలో శివ మృతదేహం



ఘటనా స్థలంలో క్షతగ్రాతుడు



అంబులెన్స్‌లో క్షతగాత్రుని తరలింపు

ప్రైవేటు ఉపాధ్యాయ, అధ్యాపక సంక్షేమానికి కృషిచేయాలి

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



మోజెస్‌కు పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, మలినేని పెరుమాళ్లు, నాగయ్య

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ, అధ్యాపకుల సంక్షేమానికి ప్రభుత్వం శాశ్వతరీతిలో చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కోరారు. సాంబశివపేటలోని ఏసీ కళాశాలలో ఆదివారం సదరన్ ప్రైవేటు అధ్యాపక, ఉపాధ్యాయ సంస్థ (ఎస్పీఎల్‌టీవో) ఆధ్వర్యంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కార ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి. నాగయ్య మాట్లాడుతూ ప్రైవేటు అధ్యాపక, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఎస్పీఎల్‌టీవో ఏర్పడినట్లు తెలిపారు. ప్రైవేటు అధ్యాపక, ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను, అధ్యాపకులను సత్కరించి, పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్, ఏసీ లా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాణీ అమృత, మలినేని ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు, అప్సా రాష్ట్ర కో–చైర్మన్ మేకల రవీంద్రబాబు, కోశాధికారి కాటూరి వెంకటేశ్వరరావు, ఎస్పీఎల్‌టీవో రాష్ట్ర నాయకులు కొండపల్లి విల్సన్, కావూరి గోవిందరావు, ఎస్పీ రసూల్, జహంగీర్ హుస్సేన్, పల్లె రత్నకుమార్ పాల్గొన్నారు.



పాలువాయి గ్రామ సమీపంలో ప్రవహిస్తున్న పిల్లి వాగు

పొంగిపొర్లుతున్న వాగులు

ఎగువ ప్రాంతాలలో కురిసిన భారీ వర్షాలతో పాటు మండలంలో ఆదివారం పడిన వర్షానికి వాగులు పొంగిపొర్లుతున్నాయి. పలు గ్రామాలలోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గోలి- జెట్టిపాలెం గ్రామాల మధ్య గోలి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలు కొన్ని గంటల పాటు నిలిచిపోయాయి. కొత్త పాలువాయి- పాత పాలువాయి గ్రామాల మధ్యతో పిల్లివాగు ప్రమాదభరితంగా మారింది. పాలువాయి, తుమ్మకోట గ్రామాల ప్రజలకు ఇతర గ్రామాల మధ్య రాకపోకలు నిలిచి పోయాయి. 40 మి.మీ. వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ కాంట్రాక్ట్ సూపర్ వైజర్ బద్దిగం ఈశ్వర్‌రెడ్డి తెలిపారు.

– రెంటచింతల